ఏయ్ ఊర్కో.. ఏం జేస్తరు?

- బీఆర్ఎస్ సభ్యులపై వేలెత్తిచూపిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్
- పల్లా స్పీచ్‌లో కవ్వంపల్లి రన్నింగ్ కామెంట్రీ

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీరు మారడం లేదనే విమర్శులు వస్తున్నాయి. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ బుధవారం సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఉద్దేశించి 'ఏయ్ ఊర్కో..' అంటూ దబాయించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రసంగం అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి చూపుడువేలు చూపిస్తూ.. 'ఏయ్ ఊర్కోండి.. ఏం జేస్తరు? ఏంజేస్తరు?' అంటూ ముందుకు వచ్చారు. ఉదయం పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతుండగా.. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రన్నింగ్ కామెంట్రీ చేస్తూనే ఉన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎక్కడ?

- ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, మార్చి26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేదే లేకుండా పోయిందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. సామాన్యుడు నిర్భయంగా వెళ్లి కేసు పెట్టే పరిస్థితి లేదని తెలిపారు. బడ్జెట్ పద్దులపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కొందరు పోలీసులు రాజకీయ నేతలకు బానిసల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఆడపిల్ల అర్ధరాత్రి రోడ్డుపై తిరగలేని దుస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. జర్నలిస్టుల ముసుగులో సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

భారీగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్

- మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 26(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరుగుతున్నదని, ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో తెలిపారు. 2023-24లో 15,623 మెగావాట్ల డిమాండ్ నుంచి 2024-25 మార్చి నెలలో 17,162మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. పదేండ్లలో ఇదే రికార్డు అని తెలిపారు. 2029-30 నాటికి 24,215 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉన్నదని, 2034-35 నాటికి 31 వేల మెగావాట్లకు పెరుగుతుందని కేంద్రం అంచనా వేసినట్టు తెలిపారు.

సన్నబియ్యంతోపాటు నిత్యావసరాలు: ఉత్తమ్

హైదరాబాద్, మార్చి26 (నమస్తే తెలంగాణ): రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం సహా 9 రకాల నిత్యావసరాల పంపిణీని త్వరలో చేపడుతామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. బడ్జెట్ పద్దులపై చర్చలో మంత్రి మాట్లాడారు. వచ్చే నెలలోనే కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని, ఉగాది పర్వదినం సందర్భంగా సన్నబియ్యం పంపిణీని సీఎం రేవంత్ ప్రారంభిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో 89 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని తెలిపారు.

'మన ఊరు-మన బడి'ని కొనసాగించండి: వాణీదేవి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విద్యపై శ్రద్ధ పెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన 'మన ఊరు-మన బడి' పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బుధవారం శాసనమండలిలో విద్యపై స్వల్పకాలిక చర్చలో ఆమె మాట్లాడారు. సర్కారు విద్యను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. బడ్జెట్‌లో 7.2 శాతం నిధులే కేటాయించారని, అవి ఏ మాత్రం సరిపోవని స్పష్టం చేశారు. సర్కారీ విద్య బలోపేతానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఏకైక ఉద్యమ గొంతుక 'నమస్తే తెలంగాణ'

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసింది

"నేడు సర్కారు వైఫల్యాలను ఎండగడుతున్నది"

- అందుకే ఆ పత్రికపై అక్కసు వెళ్లగక్కుతున్నరు
- 16 నెలల పాలనలో వివిధ పత్రికలు, చానళ్లకు ఎంత మొత్తంలో యాడ్స్ ఇచ్చిండ్రో చెప్పాలి
- సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): ప్రజా ప్రయోజనాలే ముఖ్యంగా.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' దినపత్రికలు, 'టీ న్యూస్' చానల్‌పై రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో బుధవారం అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ 'నమస్తే తెలంగాణ, టీ న్యూస్‌పై అక్కసును మంత్రి వెళ్లగక్కారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకో ఏమో మరి! దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. నాడు తెలంగాణ ఉద్యమ గొంతుకగా నిలిచిన ఏకైక పత్రిక నమస్తే తెలంగాణ.. ఏకైక చానల్ టీ న్యూస్. ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసినయి.. ఉద్యమంలో అవిపోషించిన పాత్రను ఎవరూ మరిచిపోవద్దు.. అన్ని వర్గాలను ఏకం చేసి.. ఉద్యమానికి ఊపిరిలూదిన పత్రిక నమస్తే తెలంగాణ.. తెలంగాణ ప్రాంతానికి జరిగిన, జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తెచ్చింది నమస్తే తెలంగాణ..మరుగున పడిపోయిన మన చరిత్రను చాటి చెప్పింది.. తెలంగాణ కవులు, కళాకారులను వెలుగులోకి తెచ్చింది.. రైతులు, ఉద్యోగులు, కార్మికులు.. ఇట్ల అందరి వెతలను వివరించింది నమస్తే తెలంగాణ దిన పత్రికనే' అని స్పష్టం చేశారు. 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే', 'టీ న్యూస్'పై ఆరోపణలు చేస్తున్న మంత్రి.. ఈ 16 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పత్రికలు, చానళ్లకు ఎంత మొత్తంలో యాడ్స్ ఇచ్చారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. హరీశ్ ప్రశ్నకు పొంగులేటి బదులిస్తూ 16 నెలల్లో వివిధ పత్రికలు, చానళ్లకు రూ. 200కోట్ల యాడ్స్ ఇచ్చినట్టు తెలిపారు.

16 నెలల్లో 200 కోట్ల యాడ్స్ ఇచ్చినం

- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి పొంగులేటి
- ఉద్యమ పత్రికపై కాంగ్రెస్ సర్కారు కక్ష!
- ఒక్క ప్రకటన ఇవ్వకుండా అంతులేని వివక్ష

హైదరాబాద్, మార్చి 26(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో వివిధ పత్రికలు, టీవీ చానళ్లకు రూ.200 కోట్ల విలువైన ప్రకటనలు ఇచ్చినట్టు రెవెన్యూ, ఐఅండ్‌పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి వివిధ పత్రికలు, చానళ్లకు ఎంత విలువ చేసే యాడ్స్ ఇచ్చారో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగన ప్రశ్నకు సమాధానిమిచ్చారు. 16 నెలల్లో రూ.200 కోట్ల విలువ చేసే యాడ్స్ ఇచ్చినట్టు వెల్లడించారు. కానీ, ఉద్యమం కోసం పుట్టి.. ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేసి.. ఉద్యమానికి ఊపిరిలూదిన 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఒక్క యాడ్ కూడా ఇవ్వలేదు. ఉమ్మడి పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను ఎత్తిచూపి, సబ్బండ వర్గాల వెతలను వెలుగులోకి తెచ్చి తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా నిలిచి.. ఇప్పటికీ ప్రజా సమస్యలపై పోరాడుతూ.. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న 'నమస్తే తెలంగాణ' పత్రికపై కాంగ్రెస్ కక్ష గట్టిందన్న విమర్శలు జర్నలిస్టు సర్కిళ్లలో వినిపిస్తున్నాయి. వివిధ పత్రికలు, చానళ్లకు రూ.200 కోట్ల యాడ్స్ ఇచ్చామని శాసనసభ సాక్షిగా సెలవిచ్చిన సర్కారు, 'నమస్తే తెలంగాణ' విషయంలో ఎందుకు శీతకన్ను వేసిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం అన్ని మీడియా సంస్థలను ఒకే విధంగా చూడాలని, పక్షపాతంతో వ్యవహరిస్తూ సంస్థలో పనిచేసే జర్నలిస్టులు, సిబ్బందికి నష్టం కలిగే చర్యలు తీసుకోకూడదన్న వాదనలు వినిపించాయి.

ఇక జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఇతర ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి సమాధానమిస్తూ జర్నలిస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పుతో ఇరకాటంలో ఉన్నామని, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా చూసి జర్నలిస్టులకు న్యాయం చేసేలా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. 10,954 జీపీవోల నియామకం పూర్తయిన తర్వాత వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయడం, వారి సంతానానికి ఉద్యోగాలివ్వడంపై ఆలోచిస్తామని చెప్పారు. ఇక పెండింగ్‌లో ఉన్న ఎమ్మార్వో, డిప్యూటీ ఎమ్మార్వోల బదిలీలను రెండు, మూడు రోజుల్లో పూర్తి చేస్తామని, కానీ సొంత జిల్లాలకు పంపబోమని స్పష్టం చేశారు. మంచి ముహూర్తం చూసుకొని భూభారతిని అమలు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి తొలుత ఖర్చయ్యే రూ. లక్ష కూడా భరించలేని పేదవారికి మహిళా సంఘాలతో లింకు చేసి వారి నుంచి ఆ మొత్తం ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ఇందిరమ్మ నిధులు ఇచ్చి లబ్ధిదారులనే పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు.

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దివాలా

- 15 నెలల్లో ఆ రంగానికి చేసింది శూన్యం
- రాజకీయ కమిషన్‌లా రాష్ట్ర విద్యా కమిషన్
- ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా చెలగాటం
- మెగా డీఎస్సీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ మోసం
- బీఆర్ఎస్‌నాటి విద్యావ్యవస్థపై తప్పుడు ప్రచారం
- మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

'సోనియా జీ- సోనా కహా హై? తులం బంగారం హామీ ఏమైంది?' అంటూ శాసనమండలి బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు శాసనమండలిలో బుధవారం ఉదయం నిరసన ప్రదర్శన చేపట్టారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇచ్చే హామీని అమలు చేయాలని గట్టిగా పట్టుబట్టారు. బంగారాన్ని పోలిన కడ్డీలను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తంచేశారు.

హైదరాబాద్; మార్చి 26 (నమస్తేతెలంగాణ): ఈ 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా కాలంలో విద్యారంగం దివాలా తీసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం ఆ పార్టీ దివాలాకోరుతనాన్ని నిరూపించుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగంపై కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు ఎందుకని నిలదీశారు. బుధవారం శాసనమండలిలో విద్యారంగంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆమె పలు అంశాలను లేవనెత్తారు. 15 నెలల్లోనే 1,913 స్కూళ్లను మూసేశారని, 84 మంది బిడ్డలను ఈ సర్కారు కాటికి పంపిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, రూ.1.50 లక్షల కోట్ల అప్పులు చేసి బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే ఈ ప్రభుత్వానికి పేదపిల్లల బకాయిలు చెల్లించేందుకు ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,050 టీచింగ్ పోస్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫై చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా వాటి భర్తీకి ఎందుకు నోటిఫికేషన్ ఇవ్వలేదో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామన్న కాంగ్రెసస్ మోసం చేసిందని, ఆ హామీని ఎప్పుడు నిలబెట్టుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం 58 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తే, అందులో ఒక్క ఆసిఫాబాద్ మాత్రమే బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమని, దీనికి కాంగ్రెస్ ఏం సమాధానం చెప్తుందని నిలదీశారు. రాష్ట్ర విద్యా కమిషన్ రాజకీయ కమిషన్‌లా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. గత తొమ్మిదిన్నరేండ్లలో విద్యావ్యవస్థ నాశనమైందని కమిషన్ ఏ ప్రాతిపదికన చెప్తుందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన 15 నెలల పాలనలో విద్యారంగానికి చేసింది శూన్యం అని విమర్శించారు. కానీ, తెలంగాణ ఏర్పడిన వెంటనే రాష్ట్రంలో విద్యా వికాసం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునాది వేశారని, వందలాది గురుకులాలను, ప్రభుత్వ పాఠశాలలను కొత్తగా తెరిచి లక్షలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.

అసెంబ్లీ ఆవరణలో 'పూలే' విగ్రహాన్ని ఏర్పాటుచేయండి

రాష్ట్ర అసెంబ్లీ ఆవరణంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం యూనైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆమె స్పీకర్‌కు వినతిపత్రం అందచేశారు. పూలే జయంతిరోజున ఏప్రిల్ 11లోగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేశ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, జాగృతి నాయకుడు శ్రీధర్‌రావు, యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్ల శివశంకర్, నాయకులు ఆలకుంట హరి, కొట్టాల యాదగిరి, ఆర్వీ మహేందర్, కుమారస్వామి, విజయేందర్ సాగర్, బాలకృష్ణ రాచమల్ల పాల్గొన్నారు.

పల్లాకు 16 సార్లు మైక్ కట్!

- మాటిమాటికీ అడ్డుతగిలిన ముగ్గురు మంత్రులు!
- హోంశాఖ, భూ భారతిపై సభలో ఏకిపారేసిన ఎమ్మెల్యే
- మైక్ ఇవ్వకపోవడంతో పోడియం వద్ద నిరసన
- వాకౌట్ తర్వాత 2వ గేటు వద్ద బీఆర్ఎస్ ఆందోళన

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : మాటకు మాట.. పదునైన ప్రశ్నలతో అధికారపక్షాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉక్కిరిబిక్కిరి చేశారు. బుధవారం సభ ప్రారంభమైన తర్వాత హోంశాఖ నుంచి మొదలు పెట్టి.. రెవెన్యూ, భూ భారతి అంశాలపై ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు ఒక్కో మంత్రి మైక్ అందుకొని సమాధానాలు ఇచ్చుకోవడంతోనే సమయం గడిచిపోయింది. బీఆర్ఎస్ పక్షం నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నలు సంధిస్తుంటే.. ఒకరి తర్వాత ఒకరు ముగ్గురు మంత్రులు బదులిచ్చుకోవాల్సి వచ్చింది. ఒకప్పటి పోలీసు వ్యవస్థ, ప్రస్తుత పోలీసుల తీరును పోల్చుతూ, పెరిగిన క్రైమ్ రేట్‌ను పల్లా సభ ముందు ఉంచడంతో తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకున్నారు. హోంశాఖపై చర్చ సందర్భంలోనే మంత్రి పొన్నం మూడు సార్లు, భట్టి విక్రమార్క రెండు సార్లు కలుగజేసుకున్నారు. రెవెన్యూ అంశం, భూ భారతిపై పల్లా మాట్లాడుతుండగా పొంగులేటి కలుగజేసుకున్నారు. భూ భారతి, ధరణి అంశాల్లో పల్లా వర్సెస్ మంత్రులు అన్నట్టుగా మారింది. పల్లా కౌంటర్లు వేయడంతో మంత్రి పొంగులేటి పదే పదే పల్లా ప్రసంగానికి అడ్డుతగిలారు. ఇదే అంశంపై మరోమారు భట్టి విక్రమార్క స్పందించి ధరణి, భూ భారతిపై వివరణ ఇచ్చారు. ఇరు పక్షాల నుంచి వాదోపవాదాలు జరగడంతో మంత్రులు పొన్నం, భట్టి, పొంగులేటి పదేపదే మైక్ అందుకొని మాట్లాడారు. మొత్తంగా ముగ్గురు మంత్రులు 16 సార్లు పల్లా ప్రసంగానికి అంతరాయం కలిగించారు. ఒకానొక దశలో బీఆర్ఎస్ పక్షం మాట్లాడేందుకు ప్యానల్ స్పీకర్ మైక్ ఇవ్వకపోడంతో మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, గంగుల, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పోడియం వద్ద నిరసన తెలిపారు. ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

'వద్దురా నాయనా.. కమీషన్ల పాలన'..

వాకౌట్ అనంతరం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచే నినాదాలు చేసుకుంటూ బయటికి వచ్చింది. ఎమ్మెల్యేల ఎంట్రీ గేటు వరకు నినాదాలతో హోరెత్తించారు. 'వద్దురా నాయనా.. 20 పర్సెంట్ పాలన'.. 'వద్దురా నాయనా కమీషన్ల పాలన'.. 'ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్య దోపిడీ రాజ్యం' అంటూ అసెంబ్లీలో నినదించారు.

భూములు గుంజుకుంటే ఊరుకోం: పల్లా

కాంగ్రెస్ సర్కారు రైతుల నుంచి భూములు గుంజుకోజూస్తే ఊరుకోబోమని, సాయుధ పోరాటం, లగచర్ల స్ఫూర్తితో పోరాడుతామని ఎమ్మెల్యే పల్లా హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ధ్వజమెత్తారు. మళ్లీ వీఆర్ఏ, వీఆర్‌వోలను తెస్తున్నారని, దందాలకు తెరలేపారని ఆయన మండిపడ్డారు.

పొంగులేటి ఇండ్లు ఇవ్వాలన్నా.. ఇవ్వలే

పింకు చొక్కాలు ఉన్నవాళ్లకే డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చారన్న పొంగులేటి వ్యాఖ్యలకు పల్లా కౌంటరిచ్చారు. తాము అధికారంలో ఉన్నప్పుడు డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇవ్వాలంటూ తమ పార్టీలోనే ఉన్న పొంగులేటి సిఫారసు చేస్తే తాము ఇవ్వలేదని పల్లా స్పష్టంచేశారు. 'ఉన్న వాస్తవం చెప్పాలె.. పొంగులేటి కొంత మందికి ఇవ్వమని చెప్పినా మేము ఇవ్వలేదు. 2.72 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లను కలెక్టర్, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పద్ధతి ప్రకారమే కేటాయించినం' అంటూ మంత్రి ఆరోపణలను తోసిపుచ్చారు.

నిలిచిన పల్లెప్రగతి పనులు

సమస్యలు తీర్చాలన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు • మున్సిపల్, పంచాయతీరాజ్ బిల్లులపై చర్చ

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్నిగ్రామాల్లో పల్లెప్రగతి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, కనీసం మురుగుకాల్వల్లో చెత్త సేకరణ పనులు కూడా సరిగా సాగడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు విమర్శించారు. బుధవారం శాసనమండలిలో మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిలులపై జరిగిన చర్చలో వారు మాట్లాడారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు కలిసి కార్పొరేషన్ కానున్న నేపథ్యంలో అక్కడి సమస్యలను తీర్చాలని సభ దృష్టికి తెచ్చారు. అక్కడ 1/70 చట్టం ప్రకారం గిరిజనుల, గిరిజనేతరుల ఇండ్లస్థలాల క్రయ విక్రయాల విషయంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారమే గ్రామ పంచాయతీల ఏకాభిప్రాయంతో మున్సిపాలిటీలలో గ్రామాలను కలపాలని డిమాండ్ చేశారు. విలీన గ్రామాలకు ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు. కొత్తగూడెం పరిధిలోకి తేనున్న నాయకులగూడెం వంటి గ్రామాలను పంచాయతీలుగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. చర్చలో శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారితోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, దేశపతి శ్రీనివాస్, తాతా మధు. నవీన్‌కుమార్‌రెడ్డి, యాదవరెడ్డి, వెంకటరామిరెడ్డి, బండ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది ఎమ్మెల్సీల పదవీకాలం పూర్తి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): మండలిలో పలువురు ఎమ్మెల్సీల పదవీకాలం గురువారంతో ముగియనున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాశ్‌రెడ్డి, ఎగ్గే మల్లేశం, కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంఐఎం సభ్యుడు మీర్జారియాజ్ ఉల్‌హసన్ అఫెండీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు నర్సిరెడ్డి, రఘోత్తమ్ రెడ్డి ఉన్నారు. వీరికి గురువారం మండలిలో సన్మానం ఏర్పాటు చేశారు.

గచ్చిబౌలి భూమి హెచ్‌సీయూది కాదు

- భూమితో వర్సిటీకి ఏం సంబంధం?
- సుప్రీంకోర్టులో నేను కొట్లాడి తెచ్చిన
- అక్కడ జింకలు, పులులు, సింహాలు లేవు.. గుంటనక్కలే ఉన్నాయి
- అవసరమైతే ఎమ్మెల్యేలతో వెళ్దాం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్

"కలెక్టర్లను ఎప్పుడంటే అప్పుడు, ఎన్నిసార్లు అయినా బదిలీ చేయవచ్చు కానీ, టీచర్లను బదిలీ చేయడం అంత ఆషామాషీ కాదు. రాష్ట్రంలో 26 వేల సర్కారు బడుల్లో 6.5 లక్షల మంది డ్రాపౌట్ అయ్యారు. విద్యా ప్రమాణాలు ఏ మాత్రం ఆశాజనకంగా లేవు. ప్రపంచంలో 50% సెలవు దినాలు ఉన్న శాఖ విద్యాశాఖనే.

-మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): 'గచ్చిబౌలి భూమికి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఏం సంబంధం?' అని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వ్యాఖ్యానించారు. బుధవారం అసెంబ్లీలో డిమాండ్స్‌పై చర్చ సందర్భంగా పలు అంశాలపై సీఎం స్పందించారు. 'గచ్చిబౌలిలో 25 ఏండ్ల క్రితం బిల్లీరావు అనే వ్యక్తికి ఆ భూమిని కేటాయించారు. 25 ఏండ్ల నుంచి సెంట్రల్ యూనివర్సిటీ దగ్గర ఆ భూమి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమి కేటాయింపును రద్దు చేసింది' అని సీఎం చెప్పారు. తాను వచ్చిన తర్వాత సుప్రీంకోర్టులో కొట్లాడిభూమిని ప్రభుత్వానికి సాధించిపెట్టినట్టు వివరించారు. ఆ భూమిని ఐటీ కంపెనీలు, పరిశ్రమ కోసం లే అవుట్ చేయాలని సూచించినట్టు వెల్లడించారు.

అదేమన్నా రిజర్వ్ ఫారెస్టా?

'మేము కాంక్రీట్ ప్రపోజల్‌తో ముందుకు వస్తే.. అక్కడ రిజర్వ్ ఫారెస్ట్ ఉన్నట్టు, అత్యంత అరుదైన జీవరాశులు ఉన్నట్టు చెప్తున్నారు. జింకలు, పులులు లేవు. కొన్ని గుంటనక్కలు చేరి ఇట్ల వ్యవహరిస్తున్నాయి. స్పీకర్ ఆధ్వర్యంలో అవసరమైతే ఎమ్మెల్యేలందరినీ అక్కడికి తీసుకెళ్తాం' అని సీఎం పేర్కొన్నారు.

మేము ఇంచు భూమీ కొనలేదు

ముఖ్యమంత్రి అయిన తరువాత తాను కాని, తన కుటుంబసభ్యులు కాని ఎక్కడా ఇంచు భూమి కూడా కొనలేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. భూ సేకరణ విషయంలో భూములు కోల్పోయిన వారికి ఏం చేద్దామో చెప్పాలని కోరారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ గేమ్స్‌పై కఠినంగా వ్యవహరిస్తామని, ఈ విషయమై సిట్‌ను నియమించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

పడిపోయిన విద్యా ప్రమాణాలు!

ప్రపంచంలో 50% సెలవులున్న శాఖ విద్యాశాఖనే అని సీఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఏ మాత్రం ఆశాజనకంగా లేవని స్పష్టంచేశారు. బుధవారం శాసనమండలిలో విద్యాశాఖపై జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం సమాధానాలిచ్చారు. రాష్ట్రంలో 26 వేల సర్కారు బడుల్లో 6.5 లక్షల మంది డ్రాపౌట్ అయ్యారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో 8,792 టీచర్ పోస్టులను భర్తీచేసిందని, తాము అధికారంలోకి వచ్చాక పదివేల టీచర్ పోస్టులను భర్తీచేశామని తెలిపారు.

టీచర్లతో కొట్లాడే శక్తి నాకింకా రాలె

రాజకీయ ప్రత్యర్థులు, ప్రజాప్రతినిధులతో కొట్లాడగలను కానీ, టీచర్లతో కొట్లాడే శక్తి తనకింకా రాలేదని సీఎం వ్యాఖ